క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

అక్కిరెడ్డిపాలెం: మకర సంక్రాంతిని పురస్కరించుకొని షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామికి విశేష పూజలు చేశారు. ఆదివారం పడిపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి అయ్యప్ప విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, శేషగిరిరావు, శ్రీ మణికంఠ జ్యోతి సేవా సంఘం ప్రతినిధులు, అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ముస్లిం పెద్దలు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ వద్ద రాంనగర్‌లోని మసీద్-అల్-హబీబ్‌లో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ గ్యార్వీ షరీఫ్ వేడుక విశిష్టతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా జరిపారు. అనంతరం సంయుక్త భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, గౌస్, మసీదు అధ్యక్షుడు సాహెబ్, ప్రతినిధులు నూర్ అహ్మద్, యూత్ కమిటీ సభ్యులు ఇషాక్, బషీర్, హుస్సేన్ బ్రదర్స్, అన్వార్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అభిమాన నాయకుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న గీత సహకులాల యువజనం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేత అప్పారావు, డాక్టర్ ఆర్థాని కరుణాకర్, జెర్రిపోతుల సన్యాసిరావు, కాకి శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు దుర్గవానిపాలెంలోని శివాలయంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు రంగుల రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ పైడిరాజు, యల్లబెల్లి వెంకటరమణ, పి.రాము, ఎం.గురుమూర్తి, ఈశ్వరరావు, గోవింద పాల్గొన్నారు.

ప్రతి రోజూ పండగే

- గాజువాకలో పరసల సందడి షురూ
- నెలరోజుల పాటు గ్రామీణ ఉత్సవాలు



పరసలో కళారూపం (ఫైల్)



మింది పరసలో రంగులరాట్నాలు, కోలాహలంగా జనసందోహం

గాజువాక: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి ముగిసిన నేపథ్యంలో గ్రామీణ ఉత్సవాలైన పరసల సందడి మొదలైంది. గాజువాక నియోజకవర్గంలో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఇక్కడ నెలరోజుల పాటు పరసలు కనువిందు చేస్తాయి. ఈ సందర్భంగా ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత అందాన్ని తెస్తాయి. సంక్రాంతి రోజునుంచే ఇక్కడ పరసల సందడి ప్రారంభమవుతుంది.

గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో విస్తరించిన నియోజకవర్గంలో దాదాపు 45 స్థానిక గ్రామాలున్నాయి. గాజువాకలోని పురాతన గ్రామాలైన జోగవానిపాలెం, అజీమాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలైన చినగంట్యాడ, చట్టివానిపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, తోకాడ, యారాడ, కొత్తదిబ్బపాలెం పూర్తిగా స్థానిక గ్రామాలే. వీటితో పాటు స్టీల్‌ప్లాంట్ పునరావాస కాలనీలు కూడా స్థానిక గ్రామాలే. గతంలో గ్రామాలుగా ఉన్న పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం, యాతపాలెం గ్రామాలు ప్రస్తుతం పునరావాస కాలనీలుగా అభివృద్ధి చెందాయి. ఈ ఐదు పునరావాస కాలనీల్లోను సుమారు 64 గ్రామాలకు చెందిన నివాసులు స్థానికులే. ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి ఎంతమంది వలసలు వచ్చి స్థిరపడినా స్థానిక గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సంక్రాంతి అనంతరం ఈ గ్రామాల్లో పరసల హడావుడి కనిపిస్తుంది. ఈ ఉత్సవాలకు బంధువులను ఆహ్వానించి సంబరాలను జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

సందడే సందడి

సంక్రాంతి మొదలుకొని నెల రోజుల పాటు ఈ గ్రామాల్లో పరసలు ఉత్సాహంగా కొనసాగుతాయి. అన్ని గ్రామాల్లో పరసలు, తిరునాళ్ల పేరుతో ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామీణ సంప్రదాయాలను కొనసాగిస్తారు. గాజువాక ప్రాంతానికి చెందిన పలు గ్రామాలతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన పునరావాస కాలనీల్లోను పరసలు ఘనంగా కొనసాగుతాయి. పలు ప్రాంతాల్లో ప్రముఖ వ్యక్తుల జ్ఞాపకార్థం కూడా పరసలను నిర్వహిస్తారు. పెదగంట్యాడ మాజీ సర్పంచ్ తిప్పల దయాళ్‌రెడ్డి, గాజువాక మాజీ సర్పంచ్ ఉరుకూటి చిట్టినాయుడుతో పాటు పలువురు ఇతర ప్రముఖులకు కూడా పరసలతో నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారామ ఉమా రామలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవం (గాజువాక పరస)ను ధూమ్‌ధామ్‌గా నిర్వహిస్తారు. ఈ పరసతో గాజువాక ప్రాంతంలో పరసల సందడి ముగుస్తుంది.

కళాకారులకు పండగే

పరసలు సాగే నెల రోజులపాటు కళాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయి. సంప్రదాయ కళలైన భజనలు, సాము గరిడీలు, తోడపెద్దుల ప్రదర్శన, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిడతలతో పాటు స్థానికంగా ఉండే కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం కనువిందు చేస్తాయి. ఇతర ప్రాంతాల నుంచి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సంగీత విభావరి, సాంఘిక నాటకాలు, పౌరాణిక డ్రామాలు, కోయ డ్యాన్సులు, డూప్స్ బాబోయ్ డూప్స్, బుర్రకథ తదితర కార్యక్రమాలు అలరిస్తాయి. ఈ సమయంలో కళాకారులకు ఆర్థికంగా మద్దతు కూడా లభిస్తుంది. భారీ విద్యుత్ అలంకరణలతో ఆయా గ్రామాల్లోని రోడ్లు కాంతులీనుతాయి.

వైభవంగా కోదండ రామాలయ పరస మహోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు



పూజలందుకుంటున్న సీతా, లక్ష్మణ సమేత కోదండ రాముడు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో శ్రీ కోదండ రాముడి పరస మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని, సీతా లక్ష్మణ సమేత కోదండరాముడిని దర్శించుకున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కుటుంబ సమేతంగా ఉత్సవంలో పాల్గొని, పూజలు చేశారు. ఉత్సవాల్లో తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీలు అలరించాయి. రంగుల రట్నాల వద్ద చిన్నారుల సందడి కనిపించింది. గాజువాక పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది. కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు, గుడివాడ అప్పలరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పతంగుల పండగ



ఉక్కు త్రిష్ణ మైదానంలో పతంగుల పండగను ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో పతంగుల పండగ ఉత్సాహంగా జరిగింది. సంక్రాంతి సందర్భంగా స్థానిక త్రిష్ణ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ ఉక్కునగరం యూనిట్ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పతంగుల పండుగ భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలను, పెద్దలను టీవీలకు బందీలు కాకుండా చేసిన యూత్ హాస్టల్స్ ఉక్కునగరం శాఖ ప్రతినిధులు అభినందనీయులన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పతంగులను ఎగరవేయడం, వాటిపై పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన సీనియర్, జూనియర్ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, ఇ. శ్రీనివాసరావు, సీహెచ్. వేణు, నాగసాయి, సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

దయాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



తిప్పల దయాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తిప్పల దయాల్‌రెడ్డి సేవలు మరువలేమని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. దయాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గంగవరం పోర్టు వంతెన వద్ద మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దయాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో తిప్పల అప్పలస్వామి, తిప్పల నితీష్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, మంత్రి రాజశేఖర్, గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, పల్లా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ విజేత హెచ్‌ఎస్‌ఆర్ 9 స్టార్స్



ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: సంక్రాంతి సందర్భంగా 67వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో హెచ్‌ఎస్‌ఆర్ 9 స్టార్స్ ప్రథమ స్థానాన్ని, యాదవ్ ఫ్రెండ్స్ ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు రాజాన వెంకటరావు, అచ్చయ్యనాయుడు, పల్లా పోలిపల్లి, సుంకర ప్రభాకర్, ఉరుకూటి పైడిరాజు, కామినాయుడు, పల్లా అప్పారావు, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత ఉక్కు కార్మికులదే..



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఒక పరిశ్రమ పరిరక్షణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత విశాఖ ఉక్కు కార్మికులకే దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతకు ముందు దేశంలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే దీక్షల్లో 704వ రోజు, సోమవారం దీక్షలో కార్మికులతో పాటు 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, ముస్లిం సోదరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, కె.ఎస్.ఎన్.రామారావు, ఎన్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, వై.మస్తానప్ప తదితరులు ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కార్మికులంతా ఏకమై ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్లాంట్‌లో విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సైక్లిస్ట్ దుర్మరణం



మృతుడు వెంకట రమణ (ఫైల్ ఫొటో)



ప్రమాదంలో దుర్మరణం చెందిన వెంకట రమణ

అక్కిరెడ్డిపాలెం: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనకు సంబంధించి గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డు భానోజీ కాలనీ, సీతారాంనగర్‌కు చెందిన గంట వెంకట రమణ (58) ఆటోనగర్‌లోని ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకుని, ఇంటికి వెళ్లే క్రమంలో సైకిల్‌పై ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద వెంకట రమణను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట రమణ తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

31న మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిరెడ్డి శ్రీను, పిల్లా కొండలరావు, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అద్దంలా అంతర్గత రహదారులు

- 87వ వార్డులో 1.26 కోట్లతో రోడ్ల నిర్మాణం
- రాకపోకలకు అవస్థలు తప్పడంతో స్థానికుల హర్షం



అప్పికొండ కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి



లక్ష్మీపురం ఏడుగుళ్ల వద్ద మెరుస్తున్న రోడ్డు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో రోడ్లకు మహర్దశ వచ్చింది. వార్డులోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు కూడా అద్దంలా మెరుస్తున్నాయి. వార్డులో 1 కోటి 26 లక్షల 57 వేల రూపాయల వ్యయంతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులను నిర్మించారు. దీంతో శిథిలమై, నడవడానికి కూడా వీల్లేని అస్తవ్యస్త మార్గాలన్నీ సరికొత్తగా రూపుదిద్దుకున్నాయి. గతంలో శివాజీ నగర్, తిరుమల నగర్, కాళింగ వీధి, లక్ష్మీపురం గణేష్‌నగర్, దుగ్గపువానిపాలెం తదితర ప్రాంతాల్లో రహదారులన్నీ దెబ్బ తిని, వర్షం పడితే నీరు నిల్వ ఉండిపోయేది. దీంతో స్థానికులు ఈ దారుల గుండా ప్రయాణించాలంటేనే ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయించి, నిధులు మంజూరు చేయడంతో పాటు పనులను పర్యవేక్షించి త్వరితగతిన రోడ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. రహదారులు బాగుపడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు సమస్య తీరింది

వార్డులో రహదారుల సమస్య తీరింది. గతంలో శిథిలమైన రహదారులపై ప్రయాణించాలంటేనే భయమేసేది. రాత్రి వేళల్లో ప్రయాణమంటే మరీ భయంగా ఉండేది. ఎక్కడ ఏ గుంతలో పడతామోనని ప్రయాణాలను వాయిదా వేసుకునే వాళ్లం. వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచిపోయి మరీ ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడిక ఈ సమస్య తీరింది. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో రాకపోకలకు అవస్థలు తప్పాయి.

–దుగ్గపు రవి, అప్పికొండ వీధి

కనులపండువగా మకరవేట

- వరదరాజస్వామిగా సింహాద్రి అప్పన్న
- విశేషంగా గ్రామ తిరువీధి



గజవాహనంపై స్వామి తిరువీధి ఉత్సవం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరణ చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్ఠంపజేశారు భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్ఠించారు. రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేశారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి



ఉక్కు వెంకన్న ఆలయంలో కల్యాణం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురం కాలనీలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంక్రాంతి సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

వెంకటాద్రిపై..

పెదగంట్యాడ: దయాల్‌నగర్ వెంకటాద్రిపై వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణం జరిపించారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయ్ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉక్కునగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై, కల్యాణం తిలకించారు.

ఏలేరు కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కణితి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరిగే ఏలేరు కాలువలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలు. అగనంపూడి శనివాడకు చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎస్.సత్యనారాయణకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతని కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30)కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో చికిత్స తీసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లిన ప్రవీణ్ కుమార్ రాత్రి అయినా ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో సోమవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈలోగా ఏలేరు కాలువలో మృత దేహం లభ్యమైంది. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంధకారంలో జాతీయ రహదారి

అగనంపూడి: జాతీయ రహదారి టోల్‌గేటు నుంచి అగనంపూడి మధ్య మార్గంలో అంధకారం నెలకొంది. కొన్ని రోజులుగా రహదారి మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పని చేయకపోవడంతో రహదారిలో చీకటి నెలకొంది. రెండున్నర కిలోమీటర్ల నిడివిలో సుమారు 60 వరకు దీపాలు అమర్చారు. అయితే ఇవేవీ వెలగకపోవడం, ఈ మార్గంలో రహదారి ఎక్కడికక్కడే గోతులతో నిండిపోవడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. గోతులను తప్పించబోయి, వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు వెలిగించే ఏర్పాట్లు చేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.